సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



ఊరంతా విషజ్వరాలు

నల్లమలలోని మాడాపూర్ గ్రామ ప్రజలు విషజ్వరాలతో మంచం పట్టారు.

వివరాలు 8లో ▶



..'శ్రావణ' శోభ

శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

వివరాలు 8లో ▶

గరిష్టం/కనిష్టం
31.2 /24.3

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కవిత్వంతో సమాజంలో మార్పు



నాగర్‌కర్నూల్: కవిత్వం చైతన్యాన్ని, సామాజిక బాధ్యతను ఇస్తుందని, మనిషిలోని సృజనాత్మకను బయటికి తీస్తుందని ప్రముఖ కవి సీతారం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశం హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక వేదిక, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా కవిత్వం నిర్మాణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సభకు నెలపొడుపు సాహితీ వేదిక ప్రధానకార్యదర్శి పి.వహీద్ ఖాన్ సభాధ్యక్షత వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ప్రముఖ కవి సీతారాం ప్రారంభిస్తూ.. కవిత్వం సమాజంలో మార్పును తీసుకొస్తుందన్నారు. ఉన్మాదాలు, ఉత్పాతాలు, దోపిడీ, మూఢాచారాల నుంచి చైతన్యం చేసేదే కవిత్వమన్నారు. తెలంగాణ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర సాధన వరకు కవిత్వం పాత్ర గొప్పగా ఉందని అన్నారు. కవిత్వంలో నిర్మాణం, వాటిలోని మెలుకువలు, అభివ్యక్తి, ఎత్తుగడ, శిల్పం శైలి తదితర అంశాలపై అయిదు గ్రూపులుగా విభజించి కవులతో కవిత్వం రాయించారు. అనంతరం రెండో సెషన్‌లో కవిత్వంపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కవులు, తమ కవిత్వాన్ని కవి సమ్మేళనంలో వినిపించారు. కవి సమ్మేళనం కార్యక్రమానికి ఎదిరేపల్లి కాశన్న సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కవులు కోట్ల వెంకటేశ్వర రెడ్డి, భీంపల్లి శ్రీకాంత్ ప్రసంగించారు. అనంతరం ప్రముఖ కవి సీతారాంను నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం నిర్వహించే వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యులు కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, ప్రధాన వక్తగా కేంద్ర సైట్ అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ హాజరవుతున్నారని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, మద్దిలేటి, దినకర్, బాలీశ్వర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి




ఉప్పునుంతల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉప్పునుంతలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజల అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ఆశీర్వాదం తీసుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ప్రదర్శించారు. వావిలాల రమేష్, రాఘవేందర్‌గౌడ్, వేముల నరేందర్‌రావు, దుర్గాప్రసాద్, సైదులు యాదవ్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో పలు కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆటోమొబైల్‌లో 18, మెకానికల్‌లో 56, సివిల్‌లో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని, 12న అడ్మిషన్లు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.







తగ్గిన వరద

- జూరాలలో 20 గేట్లు, శ్రీశైలంలో 6 గేట్ల ఎత్తివేత
- నారాయణపూర్ ప్రాజెక్టు క్రస్టు గేట్ల మూసివేత
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూర్/దోమలపెంట/రాజోళి/మక్తల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులకు కొన్ని రోజులుగా వరద జోరుగా కొనసాగుతుండగా.. శనివారం కాస్త తగ్గుముఖం పట్టింది. శనివారం రాత్రి 9 గంటల సమయంలో జూరాలకు 1,90,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 20 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 1,40,840 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 26,908 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇక ఆవిరి రూపంలో 68 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, కుడి కాల్వకు 684 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు కాలువకు 150 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,71,300 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.611 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన కర్ణాటకలోని ఆలమట్టి నుంచి 75 వేల క్యూసెక్కులు విడుదలవుతుండగా.. నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు మూసివేశారు. సుంకేసుల డ్యాంకు సంబంధించి నాలుగు గేట్ల ద్వారా మాత్రమే నీటిని విడుదల చేశారు. దీనికి 20,365 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. 17,916 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదులుతున్నారు. మరోవైపు శ్రీశైలం జలాశయానికి 1,85,664 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 6 గేట్లు ఎత్తి 1.62 లక్షలు, విద్యుదుత్పత్తి ద్వారా 61,128 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు మక్తల్ మండలం సంగంబండ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది.

విచారణ ఏమైనట్లు?



వ్యవసాయ శాఖలో ఓ అధికారిపై కమిషనరేట్‌లో ఫిర్యాదు

- ఓ జిల్లా అధికారికి విచారణ బాధ్యతలు
- విచారణ ఆలస్యంపై అనుమానాలు

నాగర్‌కర్నూల్: జిల్లాలోని ఓ వ్యవసాయ అధికారిపై గుట్టుగా విచారణ కొనసాగుతుంది. వ్యవసాయానికి సంబంధించిన కొన్ని పథకాల్లో అవినీతి జరిగిందని, సదరు అధికారి అవినీతికి పాల్పడ్డాడంటూ హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ చేయాలని కలెక్టర్‌కు ఉత్తర్వుల్లో పేర్కొనడంతో, కలెక్టర్ విచారణ చేసేందుకు ఓ జిల్లా అధికారిని నియమించారు. మే నెలలో విచారణ పూర్తికావాల్సి ఉండగా.. ఎన్నికలు ఉండడం, విచారణ అధికారి సెలవులో ఉండటంతో విచారణ ఆలస్యమైంది. విచారణ ఆలస్యం అయ్యేందుకు ఇవే కారణాలా, లేకుంటే ఏమైనా ఒత్తిడులు ఉన్నాయా అనే విషయాలు తెలియాల్సి ఉంది.

ఆదినుంచి వివాదాలే...

విచారణ ఎదుర్కొంటున్న అధికారి ఆది నుంచి వివాదాస్పదుడే. గతంలో మండలంలోని ఓ జాతరలో మద్యం తాగి రైతులకు అందించాల్సిన పథకాలపై బాధ్యతారహితంగా మాట్లాడటంతో కొందరు వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది. అయితే దీనిపై కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సదరు అధికారి మరింత పెట్రేగిపోయాడు. తనను ఎవరూ ఏం చేయలేరని, ఎక్కడ ఫిర్యాదు చేసినా సరే అన్నట్లుగా తన వ్యవహారం కొనసాగింది. ప్రస్తుతం జరగుతున్న విచారణ సక్రమంగా జరగుతుందా లేదా అనే అనుమానాలు రైతుల్లో కలుగుతున్నాయి. సదరు అధికారికి పైస్థాయిలో మంచి పలుకుబడి ఉండటంతో చర్యలు తీసుకుంటారో లేదో అనే అనుమానాలు రైతుల్లో రేకెత్తుతున్నాయి. గతంలో ఉన్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఇక్కడి నుంచి బదిలీ కావడంతో ఈ విషయం మరుగున పడినట్లయింది. కాగా విచారణ అధికారి మాత్రం గ్రామాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి మాత్రం తనకు మంత్రి తెలుసని మంత్రితో ఫోన్ చేయిస్తే చాలని, నన్నెవరూ ఏం చెయ్యలేరని తన సహచరులు, మిత్రులతో అన్నట్లు తెలిసింది.


అసలేం జరిగిందంటే...

కరువు పరిస్థితులు ఎదుర్కొని వ్యవసాయానికి దూరమైన రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఆర్ఏహెచ్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి జిల్లా పరిధిలో కొన్ని గ్రామాలను ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా రైతులకు గేదెలు, గొర్రెలు, కోళ్లు, మొక్కలను సబ్సిడీపై ఇచ్చేందుకు నిర్ణయించింది. అయితే గేదెల కొనుగోలుకు సంబంధించి అవినీతి జరిగిందని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గేదెలకు సంబంధించి రూ.27 వేలు రైతులు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం నుంచి రైతులకు రూ.1.16 లక్షల సబ్సిడీని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి అందించనున్నారు. రైతులు 100 కిలోమీటర్ల పరిధిలోని సంతల్లో ఈ గేదెలను రైతులకు ఇష్టపూర్తిగా ఇప్పించాల్సి ఉంది. అధికారులు మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ముందుగానే ఏర్పాటు చేసుకున్న ఏజెంట్లతో కమీషన్ల కోసం గేదెలు ఎక్కువ ధరకు ఇప్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో పలువురు రైతులు ఇదే సంవత్సరం ఫిబ్రవరి 5న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కానీ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశాలు జారీ చేశారు. రైతులను నష్టపరచడమే కాకుండా ఫిర్యాదు చేసిన రైతులను బెదిరించారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి ఒక మహిళా అధికారితో కలిసి ఈ తతంగం నడిపించారనే ఆరోపణలు ఉన్నాయి.

సర్పరక్షకుడు

తనపై విషం చిమ్మిన పాములనే రక్షిస్తున్న హోంగార్డు కృష్ణసాగర్

- పర్యావరణ పరిరక్షణలో తనవంతుగా సాయం
- ప్రకృతిని కాపాడుకోవాలంటూ 267 కి.మీ., పాదయాత్ర
- జాతీయ రహదారి పొడవునా వెయ్యి మొక్కలు
- పదేళ్లలో 7,038 పాములు, 31 మొసళ్లు, గద్ద, జింక, గుడ్లగూబ ఇతర వన్యప్రాణులకు రక్షణ



పాములకు పాలు పోసినా.. విషయమే చిమ్ముతుంది అంటారు పెద్దలు.. కానీ, ఇతనిపై ముందుగానే విషం చిమ్మిన పాములనే కాపాడుతున్నాడు వనపర్తికి చెందిన కృష్ణసాగర్. ఆటవిడుపుగా మొదలైన ఈ ప్రయత్నం .. అలవాటుగా మారి.. అభివృద్ధి, నాగరికత పేరుతో కోల్పోతున్న పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తనవంతుగా పాటుపడుతున్నాడు. ఇటు వృత్తి జీవితం.. అటు ప్రవృత్తి రెండింటినీ 'రక్షణ' కోసమే మలుచుకున్న 'సర్పరక్షకుడు' కృష్ణసాగర్‌పై ప్రత్యేక కథనం..

– వనపర్తి

సండే స్పెషల్

సమీపానికి రావొద్దని హెచ్చరిస్తుంది

అత్యంత విష పూరితమైన నాగుపాము, రక్తపింజరి పాములు మనుషులు కనిపిస్తే.. నాగుపాము పడగ విప్పి.. రక్తపింజరి తనను తాను చుట్టుకుని దగ్గరకు రావొద్దని హెచ్చరిస్తుంది. అది గమనించి దూరంగా వెళ్లిపోతే.. ఏ ప్రమాదం ఉండదు. ఒక్క కట్ల పాము మాత్రమే.. మనిషి కనిపించగానే కరిచేందుకు పైకి వస్తుంది. ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తే.. సాగర్ స్నేక్ సొసైటీతో మరిన్ని వన్యప్రాణులను కాపాడేందుకు ప్రయత్నిస్తాను. మా డిపార్ట్‌మెంట్‌లోని ఉన్నతాధికారుల నుంచి చాలా సహకారం లభిస్తోంది. పాము ఉంది పట్టుకోవాలని వచ్చే ప్రతి కాలర్ నుంచి ప్రతిఫలంగా కనీసం ఒకటి గరిష్టంగా ఐదు మొక్కలు నాటాలని కోరుతున్నాం.

– కృష్ణసాగర్, హోంగార్డు, సర్పరక్షకుడు, వనపర్తి

పదేళ్ల క్రితం పొలం వద్ద పనిచేసుకుంటున్న తండ్రికి భోజనం ఇచ్చేందుకు వెళ్లిన కృష్ణసాగర్‌ను పాము (జెర్రిపోతు) కరిచింది. వైద్యులు కరిచిన పాము ఏదో తెలుసుకోకుండా యాంటీ స్నేక్‌బైట్ డోస్ ఇవ్వడంతో పరిస్థితి విషమించగా.. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి రెండురోజుల పాటు చికిత్స చేయించి రక్షించుకున్నారు. ఆ తర్వాత ఒకరోజు నాగుపామును పట్టుకుని సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. అదిచూసిన పలువురు పాము కనిపిస్తే పట్టుకునేందుకు కృష్ణసాగర్‌కు ఫోన్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ప్రత్యేక క్లాంప్‌తో 2013 నుంచి పాములను పట్టుకోవడం, సమీపంలో అడవీప్రాంతంలో వదిలిపెట్టడం చేస్తున్నాడు. అలా మొదలైన సర్పరక్షకుడి జర్నీ.. కొద్దికాలంలోనే.. మన ప్రాంతంలో ఎన్ని రకాల సర్పాలు ఉన్నాయి.. వన్యప్రాణుల రక్షణ ఎంత ప్రాముఖ్యమైందో.. నేషనల్ జియోగ్రఫీ టీవీ చానల్, పుస్తకాల్లో చదివి మరింత పరిజ్ఞానం సాధించాడు. ఒక పక్క ఉద్యోగం చేసుకుంటూనే.. జన సంచారంలోకి వచ్చినట్లు పాములు, ఇతర వన్యప్రాణుల సమాచారం వస్తే అక్కడికి చేరుకుని వాటిని రక్షిస్తున్నాడు.

ప్రతీది నమోదు..

వనపర్తి ప్రాంతంలో ఎక్కడ పాము కనిపించినా కృష్ణసాగర్ గుర్తుకురావడం పరిపాటిగా మారింది. ఈ నెల 2న సుమారు ఏడు అడుగుల అతిపెద్ద నాగుపామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. తాను పాములు పట్టుకోవడం మొదలుపెట్టిన పదేళ్ల కాలంలో ఇంత పెద్ద పామును పట్టుకోవడం ఇదే మొదటిసారి అని.. కొంత భయం వేసినా.. ధైర్యం చేసి పట్టుకుని వెంటనే అడవిలో వదిలిపెట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఘటన తనకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిందని చెప్పారు. విష సర్పాలు, విషం లేని సర్పాలు ఏది కనిపించినా.. గతంలో కొట్టిచంపి కాల్చే సంస్కృతికి వనపర్తి ప్రాంతంలో గత దశాబ్దకాలంగా దాదాపుగా తగ్గిపోయిందని చెప్పవచ్చు. కొన్నాళ్ల తర్వాత పలువురు ఇచ్చిన సూచన మేరకు పట్టుకున్న ప్రతి పాము వివరాలు, కాల్ చేసి పిలిచిన వారి పేరు, సెల్ నంబర్లు రికార్డు చేసుకోవడం అలవాటుగా మార్చుకున్నాడు.

ప్రత్యేక బృందం సాయంతో..

జనసంచారంలోకి పాములు, ఇతర వన్యప్రాణులు వచ్చినట్లు సమాచారం అందితే విధుల్లో లేకుంటే కృష్ణసాగర్.. విధుల్లో ఉంటే తన బృందాన్ని పంపించి పాములను పట్టుకుంటారు. వాటిని ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచి సమయం దొరికినప్పుడు అడవిలో వదిలిపెడతారు. ఇలా ఇప్పటి వరకు 7,038 పాములను పట్టుకున్నారు. అలాగే జనసంచారంలోకి వచ్చిన సుమారు 31 మొసళ్లను పట్టుకుని అటవీశాఖ అధికారుల సాయంతో కృష్ణానదిలో వదిలిపెట్టాడు. గాయపడిన గద్ద, జింక, నెమలి వంటి వన్యప్రాణులకు సైతం వెటర్నరీ వైద్యులతో చికిత్స అందించి.. అడవిలో వదిలిపెట్టారు.

267 కి.మీ., పాదయాత్ర

కృష్ణసాగర్ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జోగుళాంబ ఆలయం నుంచి హైదరాబాద్ వరకు 267 కి.మీ. మేర పాదయాత్ర చేశారు. ఈ క్రమంలోనే జాతీయ రహదారిపై, హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో అటవీ శాఖ సహకారంతో వెయ్యి మొక్కలు నాటారు. స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో సమతుల్యత కాపాడేందుకు మొక్కల పెంపకంపై చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందంటూ పేర్కొంటున్నారు.



పెబ్బేరులోని ఓపాఠశాలలో పాములపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణసాగర్

సొంతూరిపై మమకారం



పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కల్కి సినిమా డైరెక్టర్ నాగ్‌అశ్విన్, తల్లిదండ్రులు డాక్టర్ జయంతిరెడ్డి, డాక్టర్ జయరాంరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

- రూ.66 లక్షలతో పాఠశాలకు నాలుగు అదనపు గదులు నిర్మించిన ప్రముఖ డైరెక్టర్ నాగ్ అశ్విన్
- గదులను ప్రారంభించి అభినందించిన కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తాడూరు: జీవితంలో ఎంత ఎత్తు ఎదిగినా.. పుట్టిన ఊరు, కన్నతల్లిని ఎప్పటికీ మరిచిపోకూడదని, కన్న తల్లితో సమానమైన సొంత ఊరు అనుబంధం పేగుబంధం లాంటిది. అలాంటి సొంత ఊరు పాఠశాల గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామం కల్కి డైరెక్టర్ నాగ్‌అశ్విన్ సొంత గ్రామం. అతని సొంత నిధులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.66లక్షలతో నూతనంగా నిర్మించిన నాలుగు అదనపు గదులను కల్కి డైరెక్టర్ నాగ్‌అశ్విన్, వారి తల్లిదండ్రులు డాక్టర్ జయంతిరెడ్డి, డాక్టర్ జయరాంరెడ్డి, ఎమ్మెల్యేతో కలిసి శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా.. జన్మనిచ్చిన గ్రామాన్ని, జీవితాన్ని ఇచ్చిన పాఠశాలను ఏ ఒక్కరూ మరిచిపోకూడదన్నారు. సహాయ, సహకారాలు అందించి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే కల్కి సినిమాతో ప్రపంచ స్థాయికి ఎదిగిన నాగ్ అశ్విన్ మన జిల్లా వాసి కావడం మనందరికి ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు.

తల్లిదండ్రుల కోరిక మేరకు..

తన తల్లిదండ్రుల కోరిక మేరకు గ్రామ పాఠశాలలోని సమస్యను పరిష్కరించేందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందించానని, గ్రామంలో గుడి, బడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో రాణించేలా గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చేలా చదివి, డైరెక్టర్లు, యాక్టర్లు, డాక్టర్లు, లాయర్లు కావాలన్నారు. కార్యక్రమంలో నాగ్‌అశ్విన్ తల్లి డాక్టర్ జయంతిరెడ్డి, తండ్రి డాక్టర్ జయరాంరెడ్డి, మాజీ సర్పంచ్ ఇందుమతి, డాక్టర్ కృష్ణారెడ్డి, గ్రామస్తులు రాంరెడ్డి, నర్సింహరెడ్డి, డీఈఓ గోవింద రాజులు, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు తెలిసేలా తీజ్ వేడుకలు



బుడ్డతండాలో నెత్తిన మొలకల బుట్టతో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, గిరిజనులు

కల్వకుర్తి/ అచ్చంపేట రూరల్: గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాలను భావితరాలకు తెలిసేలా నిర్వహించడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని బుడ్డతండాలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎంతో పవిత్రంగా గిరిజన దేవతలకు మొక్కులు చెల్లించేందుకు యువతులు మొలకల పండుగను జరుపుకోవడం సంతోషకరమన్నారు. తండాల్లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో వేడుకలు ప్రారంభం..

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని జయప్రకాశ్ నగర్ తండాలో శనివారం తీజ్ వేడుకలు ప్రారంభమయ్యాయి. గిరిజనులు భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకొంటారు. 9 రోజుల పాటు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఆనంద్ కుమార్, హనుమానాయక్, నిరంజన్ నాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తెలకపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం తెలకపల్లిలోని మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో వివిధ గ్రామాలకు చెందిన 53 మంది లబ్ధిదారులకు రూ.23లక్షలకు పైగా కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారన్నారు. రైతు భరోసా కూడా అందజేస్తామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, బండ పర్వతాలు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తండ్రిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు


సుల్తాన్ (ఫైల్)

తెలకపల్లి: కన్న తండ్రిని కసాయిగా మారి కొడుకే గొడ్డలితో నరికి చంపిన ఘటన మండలంలోని గట్టునెల్లికుదురులో చోటు చేసుకుంది. ఈ ఘటనతో గ్రామం ఉలిక్కిపడింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గట్టునెల్లికుదురు చెందిన బింగి సుల్తాన్(58) తన కొడుకు బింగి మల్లయ్య జులాయిగా తిరుగుతుండడంతో తండ్రి మందలించాడు. దీంతో తండ్రిపై కోపం పెంచుకున్నాడు. తల్లి వెంకటమ్మ వేరే ఊరికి కూలీ పనులకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన మల్లయ్య శుక్రవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పడుకున్న తండ్రిని గొడ్డలితో అతికిరాతకంగా నరికి చంపాడు. విషయం పోలీసులకు తెలియడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కుమారుడు మల్లయ్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ట్రాక్టర్‌బోల్తా : యువకుడు మృతి


పరమేష్ (ఫైల్)

శాంతినగర్ : ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం .. బుడమొర్సు గ్రామానికి చెందిన ఉప్పరి పరమేష్ (30) శనివారం ఉదయం నంద్యాలలోని బంధువులకు అప్పగించేందుకు ట్రాక్టర్ తీసుకుని బయల్దేరి వెళ్లాడు. మార్గమధ్యలో ఓర్వకల్లు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో పరమేష్ మృతిచెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. పరమేష్ మృతిచెందాడనే విషయం తెలియడంతో బుడమొర్సులో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నాగర్‌కర్నూల్ క్రైం : రియల్ ఎస్టేట్ వ్యాపారులు మోసం చేశారని మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన వనపట్లలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని ముగ్గురు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వనపట్లకి చెందిన కత్తె మల్లేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తుల నుంచి గ్రామ శివారులో నాలుగు ఎకరాల 38 గుంటల భూమిని కొనుగోలు చేశారు. మొదట కొంత నగదును ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారు. మిగతా డబ్బులను చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా వ్యాపారస్తులు కొనుగోలు చేసిన భూమిలో 10 శాతం గ్రామపంచాయతీకి ఇవ్వాలని అగ్రిమెంట్‌లో రాయించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో మల్లేష్, మిగతా ఇద్దరు తాము మోసపోయినట్లు గ్రహించారు. గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదరలేదు. దీంతో మనస్తాపానికి గురైన మల్లేష్ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. కాగా అక్కడే ఉన్న స్థానికులు అతడిని కాపాడి చికిత్సనిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

గోపాల్‌పేట: ఆర్టీసీ బస్సు ఢీ కొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గండి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం ప్రకారం.. బిజ్నాపల్లి మండలం మమ్మాయిపల్లికి చెందిన గుజ్జుల మణెమ్మ, గుజ్జుల రాములుకు ముగ్గురు కుమారులు. కాగా మూడో కుమారుడు గుజ్జుల మార్కండేయ(38) శనివారం బుద్దారంలోని వారి చుట్టాల ఇంటికి పనిమీద వచ్చాడు. తిరిగి సొంత గ్రామానికి మధ్యాహ్నం బయలుదేరాడు. ఈ క్రమంలో బుద్దారం గండి సమీపంలోకి రాగానే.. హైదరాబాద్ నుంచి వనపర్తికి వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా అతడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మార్కండేయ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించారు. గుజ్జుల మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్‌ఐ వివరించారు.

ప్రేమ పేరుతో మోసం

నవాబుపేట: ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఓ గిరిజన యువతి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ విక్రమ్ కథనం మేరకు.. అనంతపూర్ జిల్లా బ్రహ్మసముద్రం బొమ్మగానిపల్లి వంకతండాకు చెందిన గిరిజన యువతిని నవాబ్‌పేటకు చెందిన షేక్ ముస్తఫా రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లొంగదీసుకోవడంతో గర్భం దాల్చగా గతేడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేయించాడు. అప్పటి నుంచి పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో అప్పుడు ఇప్పుడంటూ కాలం వెళ్లదీస్తున్నాడంటూ యువతి ఫిర్యాదులో పేర్కొంది. తాజాగా యువతి కుటుంబ సభ్యులు ముస్తఫా కుటుంబీకులను అడగ్గా గిరిజన కులమని.. పెళ్లి చేసుకోమని తేల్చి చెప్పడంతో ముస్తాఫాతో పాటు కుటుంబసభ్యులు మైబు, తైసర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఊరంతా విష జ్వరాలు


తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారిని అంబులెన్సులో తరలిస్తున్న 108 సిబ్బంది

- కీళ్లనొప్పులు, తీవ్ర జ్వరంతో అల్లాడుతున్న 'మాడాపూర్'
- గ్రామస్తులకు ఆస్పత్రుల్లో, ఇళ్ల వద్ద చికిత్స
- కలుషిత నీరు, అధిక దోమల వల్లే సమస్య


ఇళ్ల మధ్య ఉన్న చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని మాడాపూర్ విషజ్వరాలతో తల్లడిల్లిపోతుంది. గ్రామంలో ఏ ఇంటిని చూసిన ఒకరిద్దరు వ్యాధుల బారిన పడ్డారు. గ్రామంలో మొహర్రం పండుగ నుంచి వ్యాధులు సోకడం ప్రారంభమైందని గ్రామస్తులు చెబుతున్నారు. జ్వరం, కీళ్లు, శరీరమంతా నొప్పులు, దద్దుర్లతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కీళ్ల నొప్పులతో కూర్చుంటే లేవ లేక, నడవలేక పోతున్నారు. రోజుల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా నయం కావడం లేదు. వ్యాధి సోకిన వారు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అచ్చంపేట, తెలకపల్లి, పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నుస్రత్ బేగం, అస్రుబేగం, రెహాన్, జాంగీర్, నిరంజన్, పాష, సుగుణమ్మ, రాములు, నౌశిక్, అర్షద్, సుహాస్, సోఫియా, శ్రీరాములుతో పాటు పలువురు ఇళ్ల వద్ద కనిపించగా, మిగతా వారంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో దోమల వ్యాప్తి అధికంగా ఉందని, ట్యాంకు తాగు నీరు కలుషితం అవుతుందని తెలిపారు. ట్యాంకుపై భాగంలో పావురాలు రెట్ట వేయడం, వర్షం పడితే రెట్ట మొత్తం ట్యాంకులోకి వెళ్తున్నట్లు పలువురు తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిన రోగాలను బాగుచేసి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


తెలకపల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హసీనా


పిల్లలను ఆస్పత్రిలో చికిత్స చేయించి గ్రామానికి వస్తున్న తల్లిదండ్రులు

ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం



ఇంట్లో ఉన్న వారందరూ వ్యాధులతో బాధపడుతున్నాం. ఆస్పత్రికి వెళ్లి ఇంజక్షన్ తీసుకోవడం, సెలైన్ ఎక్కించుకొని తిరిగి వస్తున్నాం. కానీ వ్యాధి నయం కావడం లేదు. తీవ్ర అవస్థలు పడుతున్నాం.

– అస్రుబేగం, మాడాపూర్

జ్వరం, కీళ్ల నొప్పులు



గ్రామంలో అందరూ రోగాలతో బాధపడుతున్నారు. నాకు జ్వరం, కీళ్ల నొప్పులు ఉన్నాయి. కొన్ని రోజుల నుంచి ఆస్పత్రికి వెళ్లి వస్తున్నా నయం కావడం లేదు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, తగిన మందులు ఇవ్వాలి.

– సుగుణమ్మ, మాడాపూర్

పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం

గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశాం. దోమల నివారణకు మందును పిచికారి చేయిస్తున్నాం. మురుగు కాల్వల వెంట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్నాం. వాటర్ ట్యాంకు శుభ్రం చేయించే పనులు చేపట్టాం.

– లలిత, పంచాయతీ కార్యదర్శి, సూరాపూర్

చికిత్స అందిస్తున్నాం

గ్రామంలో పారిశుద్ధ్య లోపం చాలా ఉంది. దోమల నివారణకు, నీరు కలుషితం కాకుండా పంచాయతీ వారికి సూచనలు చేశాం. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి చికిత్స చేస్తున్నారు. వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్, వైద్యాధికారి, అంబట్‌పల్లి పీహెచ్‌సీ

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘునాథ్ వైభవ్ గైక్వాడ్

- బంగారం, వెండి, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రఘునాథ్ గైక్వాడ్

నాగర్‌కర్నూల్ రూరల్: అచ్చంపేట ప్రాంతంలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి నిందితుల నుంచి సొమ్ము రికవరీ చేసినట్లు ఎస్పీ రఘునాథ్ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. అచ్చంపేట, కల్వకుర్తి పరిధిలో దొంగతనాలకు పాల్పడిన మోటమారి వినోద్‌కుమార్, మాండ్ల శివను శనివారం అచ్చంపేట మార్కెట్‌యార్డు పరిధిలో సీఐ రవీందర్, ఎస్‌ఐ రాములు సిబ్బందితో కలిసి పట్టుకొని విచారించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 79.2 గ్రాముల బంగారం, 131 గ్రాముల వెండితో పాటు రూ.1.40 లక్షల నగదును రికవరీ చేశామన్నారు. మోటమారి వినోద్ కుమార్ కొంతకాలంగా కొబ్బరి కాయల వ్యాపారం చేస్తూ వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నారని, కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనాయక్‌తండాకు చెందిన మాండ్ల శివ అతడి స్నేహితుడని వివరించారు. వీరిద్దరు హైదరాబాద్‌లోని సింగరేణికాలనీలో ఉంటూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొన్ని కేసుల్లో పట్టుబడి స్టేట్ హోం, జిల్లా జైలులో ఉండి విడుదలై మళ్లీ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, సీసీఎస్ సీఐ శంకర్, అచ్చంపేట ఎస్‌ఐ రాములు తదితరులు పాల్గొన్నారు.

జూరాలలో నిలకడగా విద్యుదుత్పత్తి



ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు 92.158 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు జెన్కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలియజేశారు. శనివారం ఎగువలోని కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టామన్నారు. జూరాలకు అత్యధికంగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో దిగువ జూరాలలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టలేక పోతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన శనివారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి వైపు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా అన్నారం సమీపంలో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరు వ్యక్తులు పెద్దకొత్తపల్లి మండలం రామకృష్ణ, రవిగా గుర్తించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పెదనాన్న ఇంట్లో దొంగతనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

48 గంటల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ధన్వాద: జల్సాలకు అలవాటు పడి వరుసకు పెదనాన్న అయ్యే వ్యక్తి ఇంట్లో ఓ యువకుడు దొంగతనానికి పాల్పడగా.. పోలీసులు 48 గంటల్లో పట్టుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు డీఎస్పీ లింగయ్య శనివారం ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చర్లపల్లిలో గురువారం సంజగారి రాజప్ప ఇంట్లో రూ. 2.40 లక్షలు చోరీకి గురయ్యాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు అయిన సంజగారి రమేష్(19) శనివారం ధన్వాడలోని బీసీ కాలనీ వద్ద ఉన్న అంబేడ్కర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించారు. దీంతో అతడు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. కాగా అతడు ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడడం, మద్యం సేవించడం వంటి వాటికి అలవాటు పడ్డాడని డీఎస్పీ వివరించారు. అందుకోసం డబ్బులు కావాలని ఆలోచించి పెదనాన్న వరుస అయిన రాజప్ప ఇంట్లో ఒకడిగా ఉంటూ చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. వారు లేని సమయంలో.. ఇంటితాళం పగులగొట్టి లోపల ఉన్న ఇనుప పెట్టె తాళం విరగొట్టి అందులో ఉంచిన రూ.2.40లక్షలు కాజేశాడన్నారు. నగదును తన బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు మరికల్‌లోని ఆన్‌లైన్ సెంటర్‌కు వెళ్తూ..చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. నిందితుడి వద్ద ఉన్న డబ్బులను స్వాధీనం చేసుకొని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారని వివరించారు. అనంతరం రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రమేష్, సిబ్బందిని అభినందించి రివార్డులను అందజేశారు.

ఎస్సీ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న ఇస్లాముద్దీన్

స్టేషన్ మహబూబ్‌నగర్: దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు ఎస్సీ రిజర్వేషన్ హోదా కల్పించాలని ఆలిండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ఇస్లాముద్దీన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం 1901, 1911, 1921, 1931 సంవత్సరాల్లో ముస్లిం కులాల జనాభా లెక్కలు తీసి అవమానాలతో అట్టడుగు జీవితాలు గడుపుతున్న 96/97 కులాలను దళిత ముస్లింలుగా 1936లో ఎస్సీ రిజర్వేషన్ హోదా మతాలకతీతంగా కల్పించారని తెలిపారు. 1950 వరకు ఈ రిజర్వేషన్లు కొనసాగాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1950 ఆగస్టు 10న అప్పటివరకు కొనసాగిన ఎస్సీ రిజర్వేషన్లను కేవలం దళిత హిందూ కులాలకు మాత్రమే పరిమితం చేసి హిందుయేతరులైన దళిత ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ మతాల్లోని వారికి తొలగించినట్లు తెలిపారు. 1956లో దళిత సిక్కులు, 1990లో దళిత బౌద్ధులకు తిరిగి ఎస్సీ హోదా కల్పించారని పేర్కొన్నారు. కానీ దళిత ముస్లింలు, దళిత క్రైస్తవ కులాలకు తిరిగి కల్పించలేదన్నారు. అందుకే ప్రతి ఏడాది ఆగస్టు 10న బ్లాక్‌డే చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డా.సైరాబాను, రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షద్ అహ్మద్, మహ్మద్ నసీర్, మహ్మద్ కరీం తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

ర్యాగింగ్‌తో పాటు కళాశాలలో వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు


అనూష (ఫైల్)

కృష్ణా: నారాయణపేట జిల్లా కృష్ణా మండల కేంద్రానికి చెందిన అనూష(24) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. అయితే ఈ అమ్మాయి మృతిపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. అనూష హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. కాగా 20 రోజుల క్రితం కళాశాల నుంచి ఫోన్ చేసి.. 'మీ అమ్మాయికి జ్వరం వచ్చింది.. ఇంటికి తీసుకెళ్లండి' అని చెప్పారు. దీంతో తండ్రి లక్ష్మణ్ కళాశాలకు వెళ్లి ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. అయితే ఇంటికి వచ్చినప్పటి నుంచి అనూష మానసికంగా కృంగిపోయి, మగవారిని చూసి భయపడటం, బాత్‌రూంలోకి వెళ్లాలన్నా తీవ్రంగా వణికిపోయేది. దీంతో ఆందోళన చెందిన కుటుంబీకులు ఆస్పత్రులకు చూపించినా నయం కాలేదు. తర్వాత కళాశాలకు వెళ్లి తమ కూతురికి ఏం జరిగిందని ఆరాతీశారు. కళాశాలలో ర్యాగింగ్‌తోపాటు తోటి విద్యార్థులు వేధించినట్లు కొందరు విద్యార్థులు చెప్పారని సమాచారం. ర్యాంకర్ కావడం వల్లే తోటి విద్యార్థులు ఓర్వలేక అలా చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఆలయాలకు 'శ్రావణ' శోభ


మన్యంకొండలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

- శ్రావణమాసం తొలి శనివారం.. కిటకిటలాడిన ఆలయాలు
- జనసంద్రమైన మన్యంకొండ
- దర్శనానికి బారులుతీరిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: శ్రావణమాసం తొలి శనివారం మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణ భక్తజనసంద్రమైంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 7 నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని స్వామివారి సన్నిధిలో ప్రతి రోజు శాంతిహోమం నిర్వహిస్తారు.

వైభవంగా శేషవాహనసేవ..

రాత్రి స్వామివారి శేషవాహన సేవ, తిరుచ్చిసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని శోభయమానంగా అలంకరించిన శేషవాహనంలో ఉంచి గర్భగుడి నుంచి ఆలయం ఎదుట ఉన్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మేళతాళాలు, భక్తుల హరినామస్మరణ నడుమ ఊరేగింపు ముందుకు కదిలింది. శేష వాహనంలో స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారిని తిరిగి గర్భగుడికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన కురుమతిగిరులు..


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: శ్రావణమాసం మొదటి శనివారం పురస్కరించుకొని మండలంలోని అమ్మాపురం సమీపంలోని కురుమూర్తి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు తెల్లవారుజామునే ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాతసేవ నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే అమ్మవారి ఆలయం, స్వామి వారి పాదాలు, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల్లో రద్దీ కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని వసతులు కల్పించింది.

ఊర్కొండపేట అంజన్న ఆలయంలో..


సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు దత్తుశర్మ, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసశర్మ, మహేశ్ పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి..

- మూడు రోజుల్లో.. 3 కేసులు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎన్.లింగయ్య


దొంగిలించిన సిలిండర్లను చూపుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ లింగయ్య పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలను డీఎస్పీ వెల్లడించారు.

- జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన నగిరి ఆనంద్ కొంతకాలంగా పట్టణంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేసి ఇటీవలే మానేశాడు. తాగుడుకి బానిసై అప్పులు కావడంతో డబ్బుల కోసం సిలిండర్లను దొంగాలించాలని నిర్ణయించుకున్నాడు. తనకు పరిచయం ఉన్న ఆటోలో నీటి సరఫరా చేసే నర్సింహులు సాయంతో పథకం ప్రకారం గురువాం రాత్రి శాసన్‌పల్లి రోడ్‌లో ఉన్న గ్యాస్ గోదాం తాళం పగలగొట్టి 25 సిలిండర్లను దొంగిలించి ఇంట్లో దాచి పెట్టారు. శుక్రవారం సిలిండర్లను అమ్మేందుకు వెళ్తుంటే పోలీసులు పట్టుకొని విచారించారు. సిలిండర్లను తామే దొంగిలించామని ఒప్పుకోవడంతో ఆటోను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు.
- జిల్లాకేంద్రంలోని పళ్లకు చెందిన అనిమొళ్ల శివరాజ్ తండ్రి కొంతకాలం కిందట మృతిచెందాగా.. తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంట్లో పూజలు చేయించాలంటూ ఇరుగు పొరుగు వారు చెప్పడంతో బారంకుంటకు చెందిన గజ్జెల్లి నరేష్ అలియాస్ రిశాంత్‌ను సంప్రదించారు. ఇంట్లో పూజలు చేసి బాధలు తొలగిస్తానంటూ రిశాంత్ వారి నుంచి రూ.40 వేలు తీసుకున్నాడు. తాను మోసపోయనని గ్రహించిన బాధితుడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సత్యనారాయణచౌరస్తాలో రిశాంత్‌ను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.
- జాజాపూర్‌కు చెందిన మన్నె వెంకటేష్ తాగుడుకు బానిసై డబ్బుల కోసం బైరంకొండ గ్రామ చివరిలో ఉన్న విజయలక్ష్మి ఇంట్లో గురువారం చోరీకి పాల్పడ్డాడు. బీరువాలో ఉన్న బంగారు గొలుసు, పుస్తెల తాడును దొంగలించి చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించాడు. పుస్తెలతాడును విక్రయించేందుకు నారాయణపేటకు రాగా పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులను ఛేదించిన ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుళ్లు రాము, ఆంజనేయులు, లింగమూర్తి, యాదయ్య, మల్లేష్, రాజును డీఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు.